జూదాల నిర్వహణపై సమాచారం ఇవ్వండి



లక్ష్మీపురం(తిరువూరురూరల్): సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు నిర్వహించరాదని, పాల్గొనవద్దని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. లక్ష్మీపురం సచివాలయం వద్ద మంగళవారం కోడిపందేల నియంత్రణపై రూపొందించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. జూదాల కారణంగా డబ్బు పోగొట్టుకోవడమే కాక శాంతిభద్రతల సమస్యలకు కారణమవుతారని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎక్కడైనా జూదాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

పశువులకు బ్యాండ్స్ పంపిణీ

లక్ష్మీపురం(తిరువూరురూరల్): తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని లక్ష్మీపురంలో పశువులకు రేడియం బ్యాండ్స్, బెల్టులు పంపిణీ చేశారు. రహదారులపై సంచరించే పశువులు రాత్రివేళ చీకట్లో కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నందున రేడియం బ్యాండ్స్ ఉపయోగకరంగా ఉంటాయని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, లక్ష్మీపురం సర్పంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూమిలో కర్బన సేంద్రియం పెంపు మేలు

మైలవరం: భూమిని ఏదో ఒక పంటతో కప్పి పుచ్చుకోవాలని, తద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెంచుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి తెలిపారు. రైతులు వరి పంట కోసిన తరువాత రబీ పంట వేయకుంటే ఏదో ఒక పంటతో ఎప్పుడూ కప్పి ఉంచాలన్నారు. పురుగు మందులతో పాటు వేప సంబంధిత మందులు కూడా కలిపి వాడాలని సూచించారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. మైలవరం మార్కెట్ యార్డు ఆవరణలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మైలవరంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయకుమారి, సంధ్యారాణి తదితరులు

సర్పంచ్ నాగమల్లేశ్వరి, ఏఓ కె. సంధ్యారాణి, వీఏఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

మామిడిలో తామర పురుగుల నివారణకు చర్యలు

ఆగిరిపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తామర పురుగుల పెరుగుదలకు అనుకూలంగా ఉన్నందున మామిడి రైతులు వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక అన్నారు. కృష్ణవరం, సురవరం గ్రామాల్లోని మామిడి తోటలను మంగళవారం ఆమె పరిశీలించి తామర పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తామర పురుగు నివారణకు ఒక లీటర్ నీటిలో ఐదు మిల్లీ లీటర్ల వేప నూనె, 0.3 మిల్లీ లీటర్ల ఇమిడా క్లోరోప్లేడ్‌ను పిచికారీ చేయాలన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

నల్గొండ బిషప్ థమస్ కుమార్



దివ్యబలి పూజ చేస్తున్న బిషప్ కరణం థమస్ కుమార్, బి.అనిల్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ ప్రేమ, సమాధానం, ఐక్యత కలిగి క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని నల్గొండ కథోలిక పీఠం బిషప్ కరణం థమస్ కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం సహాయమాత ఆర్సీఎం చర్చి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువు బెల్లంకొండ అనిల్ కుమార్ బాస్కో ఆధ్వర్యంలో జరిగిన దివ్యబలి పూజలో థమస్ కుమార్ మాట్లాడుతూ మతం అనేది మార్గంగా ఉండాలి తప్ప విభజనకు దారితీయకూడదన్నారు. ప్రభువు చూపిన మార్గంలో ప్రపంచ శాంతిని ప్రతిఒక్కరూ కోరుకోవాలని చెప్పారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన మహిమ దేవ రహస్య సముదాయాలను ప్రారంభించారు. భక్తులకు ప్రేమ విందు నిర్వహించారు. వివిధ విచారణల గురువులు, సిస్టర్స్ పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు జీతాలు పెంచాలని వినతి

నూజివీడు: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు, పాఠశాలల్లోని ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచాలని ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్‌కు స్కీమ్ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. పుల్లారావు మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆయాల ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వేతనాలను రూ.10 వేలకు పెంచాలని, హెల్త్ కార్డు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఏ నెల బిల్లులు ఆ నెలే చెల్లించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అంజమ్మ, తహిరున్నీసా, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, శోభ, స్కూల్ ఆయాలు ఎం.కుమారి, దుర్గ, లక్ష్మి, మరియమ్మ, రమణమ్మ, రేణుక, దేవమాత, పి.కుమారి, నూర్జహాన్ పాల్గొన్నారు.

సభ్యులు నేరుగా బ్యాంకుల్లోనే రుణం చెల్లించాలి

మైలవరం: మహిళా సమాఖ్య సభ్యులు తీసుకున్న రుణాలను నేరుగా బ్యాంకు కౌంటర్లలో చెల్లించి రసీదు తీసుకోవాలని డీఆర్‌డీఏ ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె. శ్రీనివాసరావు అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని మండల మహిళా సమాఖ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వీఓల పని తీరు మెరుగుపర్చుకోవాలని, ప్రతి నెలా రెండు సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశాల్లో చేసిన తీర్మానాలను ఎలా నమోదు చేయాలో వివరించారు. అర్హత ఉన్న ప్రతి సంఘానికి బ్యాంకు రుణాలు రూ.20 లక్షలు అందజేయాలని రెడ్డిగూడెం ఏపీఎం బొలగాని రామకృష్ణ అన్నారు. విసన్నపేట ఏరియా కో-ఆర్డినేటర్ యూ. రాజేశ్వరి, జిల్లా డీపీఎం ఎమ్. సునీతలక్ష్మి, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బోరు ఏర్పాటు

మైలవరం: మైలవరంలోని మాదాల బుల్లయ్య ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రవాసాంధ్రులు డాక్టర్ కుడుముల అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. లక్ష నిధులతో బోర్, వాటర్ పైప్‌లైన్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. పాఠశాలకు క్రీడా పరికరాలను అందజేశారు. ప్రవాసాంధ్రులు డాక్టర్ అనిల్ కుమార్‌రెడ్డి కుమార్తె ఆశ్రిత పుట్టిన రోజును పురస్కరించుకుని వీటిని ఏర్పాటు చేశారు. వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులు అందజేశారు. వెల్వడం, దాసుళ్ళపాలెం పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. దాసుళ్ళపాలెంలోని ఎలిమెంటరీ పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష వరకు వినియోగించనున్నట్లు డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు.

సంక్షిప్తంగా...

• వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దామని నాయకులు పల్లగాని నరసింహారావు, మచ్చా హరిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన మచ్చా హరిబాబును ఆగిరిపల్లి మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల ఎస్సీ సెల్ నాయకులు మల్లంపల్లి రవిశేఖర్, నల్లమోతు కాంచనరావు, కంబాల ప్రదీప్ కుమార్, బొర్లపూడి తిరుపతిరావు, సుభాని పాల్గొన్నారు.

• వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

మైలవరం: దక్షిణ భారత విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని పి. సీత ఎంపికైందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నేస్వామి మంగళవారం తెలిపారు. సీత ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ చదువుతోందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అభినందించారు.

• ఓబన్న విగ్రహానికి విరాళం

మైలవరం: స్థానిక వడ్డెర కాలనీలో వడ్డెర ఓబన్న విగ్రహానికి రూ. లక్ష విరాళాన్ని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే వసంత వెంక కృష్ణప్రసాద్ మంగళవారం అందజేశారు. స్థానిక కంచి కామాక్షి గుడికి మరో రూ.లక్ష, మైలవరం బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళం అందజేశారని ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి నాగ మల్లేశ్వరరావు తెలిపారు.

• లారీ డ్రైవర్ల ఆందోళన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆయిల్ రంగ సంస్థల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న లారీ డ్రైవర్లకు కనీస భద్రత కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, జి.కొండూరు మండల అధ్యక్షుడు ఎస్.సుందరరావు డిమాండ్ చేశారు. బీపీసీఎల్ కంపెనీలో లారీ వర్కర్స్ సమస్యలపై మంగళవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం బీపీసీఎల్ ఆయిల్ ట్రక్ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా టి.శివకృష్ణ, కార్యదర్శిగా సీహెచ్ అంకరాజు, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరెడ్డి, మరో 13 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

• ఫర్నిచర్ వితరణ

ఇబ్రహీంపట్నం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం బ్రాంచి అధికారులు పీహెచ్‌సీకి రూ.2 లక్షల విలువైన వివిధ రకాల ఫర్నిచర్‌ను మంగళవారం అందజేశారు. రోగుల కోసం మూడు బెడ్స్, ఇంజక్షన్ ట్రాలీలు 6, స్టాండ్ బీపీ ఆపరేటర్స్ 2, బేబీ వార్మర్ ఒకటి, ఐరన్ 3 సీట్ బెంచీలు 2 వైద్యశాల అధికారులకు అందజేశారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ బి. నవీన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

• స్టడీ మెటీరియల్ పంపిణీ

చాట్రాయి: చనుబండ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. చనుబండ మెయిన్ స్కూల్ ఉపాధ్యాయుడు మోదుగు రవి వీటిని సమకూర్చారు.

• దీపం కనెక్షన్‌లో పేరు మార్పునకు అవకాశం

తిరువూరు: దీపం గ్యాస్ కనెక్షన్ పొందిన మహిళ మరణిస్తే ఆమె కుటుంబంలో వేరొకరి పేరుతో మార్పునకు అవకాశం కల్పిస్తున్నామని తిరువూరు శ్రీ రఘు గ్యాస్ ఏజెన్సీస్ మేనేజరు గంజా కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మరణించిన మహిళకు ఉన్న రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్న భర్త లేదా పిల్లల పేరుతో దీపం కనెక్షను మార్పు చేయడానికి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించాలని కోరారు.

• కొత్త రైల్వే లైన్ నిర్మించాలని లేఖ

తిరువూరు: కొండపల్లి నుంచి తిరువూరు మీదుగా సత్తుపల్లికి రైల్వేలైను నిర్మించాలని కేంద్ర కార్మిక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్ విజ్ఞప్తి మేరకు ఈ కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో పాటు సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు ప్యాసింజర్ రైల్ సర్వీసు ప్రారంభించాలని కిషన్‌రెడ్డి కోరారు.

• వయోజన విద్య పుస్తకాల అందజేత

ఇబ్రహీంపట్నం: వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న వయోజన విద్య కార్యక్రమాన్ని నిరక్షరాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో వివిధ గ్రామాల్లో గుర్తించిన నిరక్షరాస్యులకు వయోజన విద్య పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో చదువులేని డ్వాక్రా మహిళలు, వంట ఏజెన్సీలు, నైట్ వాచ్‌మెన్‌లు 270 మందిని ఇప్పటికే గుర్తించారన్నారు. వీరికి చదువు చెప్పేందుకు 27 మంది విద్యా వలంటీర్లను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపీడీఓ సునీతశర్మ, వయోజన విద్య నోడల్ అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

• గోదాదేవికి ధనుర్మాస పూజలు

తిరువూరు: స్థానిక రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం గోదాదేవికి, ఆంజనేయస్వామికి తొమ్మిదిరకాల పండ్లతో విశేషాలంకరణ చేశారు. ఆలయ అర్చకులు ప్రాతఃకాల అర్చన, సేవాకాలం అనంతరం ఆళ్వార్లకు విశేష నివేదన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలో వైష్ణవ గోష్టి సభ్యులు గజహారతి సమర్పించారు. కోదండ రామాలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది.

• విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల బాదుడు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పుపట్టారు. ఇటువంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జీ ఏఈ కొమ్ము వాసుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

• అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గుంటూరు 10 (ఏ) గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కేతనకొండలో జరుగుతున్న అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు, ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించడం, ప్రమాద పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడం వంటి అంశాలను వివరించారు.

• కోడి పందేల బరులు ధ్వంసం

మైలవరం: రంగాపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు వేసేందుకు సిద్ధం చేసిన బరులను అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ జె. సుశీలాదేవి రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం ధ్వంసం చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులు శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో ఎస్సై బి. మోహనరావు, ఆర్‌ఐ గంధం పుల్లయ్య, కే రాజేష్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా నూజివీడు పట్టణం

నూజివీడు: నూజివీడు పట్టణం ఒక్క వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవించిన రోజుల నుంచి నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోంది. 60కి పైగా గ్రామాలకు కూడలిగా ఉన్న నూజివీడు పట్టణం నేడు విద్య, వైద్య, వ్యాపార, నిర్మాణ, వాణిజ్య రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తోంది. అపార్ట్‌మెంట్ కల్చర్ సైతం రోజురోజుకూ పెరుగుతోంది.

విద్యారంగంలో పైపైకి..



గౌతమ్ స్వీట్స్



బాలాజీ జ్యుయలరీ మార్టు

ఇప్పటికే ఇక్కడ ఇంజినీరింగ్ కళాశాల, పీజీ కేంద్రం, బీఫార్మసీ, డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలు ఉన్నాయి. త్వరలోనే ఇంటర్నేషనల్ స్కూల్ సైతం ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి రానుంది.



నూజివీడు ట్రిపుల్ ఐటీ

శరవేగంగా విస్తరిస్తున్న నిర్మాణ రంగం

పట్టణంలో నిర్మాణ రంగం శరవేగంగా విస్తరిస్తోంది. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌ల కల్చర్ పెరుగుతోంది. పదేళ్ల కిందట ఒక్క అపార్ట్‌మెంట్ కూడా లేని పరిస్థితి నుంచి నేడు 20 అపార్ట్‌మెంట్లకు పైగా నిర్మాణం చేస్తున్నారు.

విస్తరిస్తున్న వ్యాపార, వాణిజ్యం

రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు సైతం నూతన వ్యాపారాన్ని నూజివీడు పట్టణంలో ఇటీవలి కాలంలో ప్రారంభిస్తున్నాయి. కిరాణా, వస్త్ర, మందులు, బంగారం, ఎలక్ట్రానిక్స్, స్వీట్ షాపులు తదితర షోరూంలు నూజివీడులో ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కంపెనీల ద్విచక్ర వాహనాల షోరూంలు, కార్ల కంపెనీల షోరూంలు సైతం ఇక్కడ ఏర్పాటయ్యాయి. వీటికి తోడు మల్టీప్లెక్సులు, థియేటర్లు సైతం అందుబాటులోకి వచ్చాయి.

వైద్య రంగంలో పురోగతి

ఒకప్పుడు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. చిన్న పిల్లలకు వైద్యం కూడా సరిగా ఉండేది కాదు. నేడు నూజివీడులో అన్నిరకాల వైద్యం అందుబాటులోకి వచ్చింది. పిడియాట్రీషియన్స్, స్కిన్ స్పెషలిస్టులు, జనరల్ మెడిసిన్, గైనకాలజిస్టు, దంత, నేత్ర, ఆర్థోపెడిక్ తదితర వైద్య సేవలతో పాటు స్కానింగ్ సెంటర్లు, పదుల సంఖ్యలో ల్యాబ్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి.



శ్రీ వెంకటేశ్వర నర్సింగ్‌హోం



నూజివీడులోని పీజీ కేంద్రం

రజతోత్సవాలకు కుమార్ స్కూల్ సిద్ధం

నూజివీడు: 190 మంది విద్యార్థులతో నూజివీడు పట్టణంలోని సమతానగర్‌లో 2000 సంవత్సరంలో ప్రారంభమైన కుమార్ స్కూల్ ఈ ఏడాది రజతోత్సవ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ 25 ఏళ్లలో ఎన్నో ఉత్తమ ఫలితాలు, ఉత్తమ పాఠశాల అవార్డు, తల్లిదండ్రుల మన్ననలను, ప్రశంసలను పొందుతూ కుమార్ స్కూల్ ముందుకు సాగుతోంది. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా పయనిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేస్తోంది. యాజమాన్యమే ఉపాధ్యాయులుగా నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోంది కుమార్ స్కూల్.